ఖానాపురంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వెలమ కులస్తులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ క్షమాపణ చెప్పాలి

- వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- వెలమ సంఘం నాయకులు

ఖానాపురం/నల్లబెల్లి/వర్ధన్నపేట, డిసెంబర్ 7: వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వెలమ కులస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఖానాపురం మండలంలోని వెలమ కులస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెలమ కుల సంఘం మండల బాధ్యుడు తక్కళ్ల పల్లి బాబురావు మాట్లాడుతూ ఎమ్మెల్యే పదవిలో ఉన్న శంకర్ పదేపదే వెలమ కులస్తులను కించపరుస్తూ మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే స్పీకర్, ఎమ్మెల్యే సభ్యత్వాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమేశ్వర్‌రావు, హరీశ్‌రావు, అనిల్, సాగర్‌రావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యేపై వెలమ సంఘం మండల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెలమ సంఘం మండల నాయకుడు బచ్చు వెంకటేశ్వర్‌రావు మా ట్లాడుతూ ఎమ్మెల్యే హోదాలో ఉన్న శంకర్ వెలమ కులస్తుల అంతు చూస్తామని మాట్లాడడం హేయమన్నారు. ఇలాంటి వారిని చట్టసభల్లోకి పంపిన ఓటర్లు నేడు సిగ్గుతో తలవంచుకునే దుస్థితిని తీసుకురావడం క్షమించరానిదన్నారు. నాయకులు సందినేని సంపత్‌రావు, బచ్చు సంపత్‌రావు, పీ రాజేశ్వర్‌రావు, గుజ్జ సంపత్‌రావు, డీ రవీందర్‌రావు పాల్గొన్నారు. అంతేకాకుండా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వెలమ సామాజిక వర్గం ప్రతినిధులు వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చందర్‌కు ఫిర్యాదు చేశారు.

పత్తి కొనుగోళ్లలో దోపిడీని అరికట్టాలి

- గ్రామాల్లో పత్తి రైతులను మోసం చేస్తున్న దళారులను శిక్షించాలి
- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్

కాశీబుగ్గ, డిసెంబర్ 5: పత్తి కొనుగోళ్లలో దోపిడీని అరికట్టాలంటే సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జేడీఎం, డీడీఎం, డీఎంవో, మార్కెట్ కార్యదర్శులను శనివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ పత్తి రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలు, ప్రకృతి వైపరీత్యాలను దాటుకొని అరకొరగా పత్తి పండిస్తే మద్దతు ధర కల్పించి ఆదుకోవాల్సిన సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు కుమ్ముక్కై దళారులతో పత్తిని కొనుగోలు చేయిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీసీఐ అధికారులు లూజు పత్తిని నిరాకరించగా, అదే పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసి, తిరిగి సీసీఐకి విక్రయిస్తున్నారని ఆరోపించారు. తూకంతో అనేక మోసాలు జరుగుతున్నాయని, వెంటనే అధికార యం త్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌రెడ్డి హంసరెడ్డి, బాబురావు, మహ్మద్ ఇస్మాయిల్, సుంచు జగదీశ్వర్, గోనె రామచందర్, ఐతమ్ నగేశ్, పరిమళ గోవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సమావేశానికి హాజరై బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌వి 420 మోసాలు

- హామీలు అమలు చేయని ప్రభుత్వం
- గత పనులను రద్దు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి
- నర్సంపేట నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డి సర్కార్ మోసాలపై ఫైర్

నర్సంపేట, డిసెంబర్ 7: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 420 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. నర్సంపేటలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం బీఆర్ఎస్ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలపై పెద్ది మాట్లాడారు. సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తప్ప ఎలాంటి పనులు జరగలేదన్నారు. తెలంగాణలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిలో వెనకబడడం దురదృష్టకరమన్నారు. అభివృద్ధి, మార్పు కోసం నర్సంపేట ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు సఖ్యత లేనట్లు నటిస్తూ.. చీకటి ఒప్పందాలతో వారు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

ముఖ్యమంత్రిపై చీటింగ్ కేసు నమోదు చేయాలి

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై 420, చీటింగ్ కేసు నమోదు చేయాలని పెద్ది డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుకు నర్సంపేట నియోజకవర్గంలో దిక్కెవరని ప్రశ్నించారు. నర్సంపేటలో అభివృద్ధి, సంక్షేమం ఆగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి, అక్రమ కేసులు, పోలీసుల రాజ్యం మాత్రమే కనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా పార్టీ నాయకత్వాన్ని బయపెట్టలేరని హెచ్చరించారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే నాయకుడే లేడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో నర్సంపేటకు కోట్లాది రూపాయల పంట నష్టపరిహారం తీసుకొచ్చినట్లు పెద్ది గుర్తుచేశారు. గతంలో తాను తీసుకొచ్చిన జీవోలు దొంగవని పోలీస్ కేసులు కూడా పెట్టారన్నారు. ఇప్పటివరకు తేల్చలేదన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తాను తీసుకొచ్చి నిధులను సొంత కాంట్రాక్ట్ సంస్థతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ట్రైబల్ వేల్ఫేర్ ద్వారా ప్రతి తండాకు తాను బీటీరోడ్డు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆ పనులను రద్దు చేసి నిలిపివేశారన్నారు. కేవలం లాభాల కోసం తన సొంత కాంట్రాక్ట్ సంస్థలతో మళ్లీ టెండర్లు పిలిపించుకున్నట్లు విమర్శించారు. గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తండాల రోడ్లు రద్దు చేయడం దురదృష్టకరమన్నారు.

కాంగ్రెస్ నేతలు సంస్కారహీనులు..

నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో కూడా తనను అరెస్టు చేశారని పెద్ది ఆవేదన వ్యక్తం చేశారు. అంత పెద్ద దవాఖాన నిర్మాణానికి 20 ఎకరాల స్థలాన్ని కొనిచ్చిన దొడ్డ మోహన్‌రావును పిలవకపోవడం దారుణమన్నారు. కనీసం ఆయనను పిలిచి శాలువా కప్పని సంస్కారహీనులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అని విమర్శించారు. ప్రస్తుతం ఏ శాఖలో పనులు చేయాలన్నా లంచాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత దొంతి ఒక్కసారి అయినా సమీక్షించారా అని ప్రశ్నించారు. గృహలక్ష్మి పథకంలో మంజూరైన ఇండ్లను పక్కనబెట్టారని, తాము న్యాయ వ్యవస్థను ఆశ్రయించినట్లు తెలిపారు. నర్సంపేటకు ప్రత్యేకంగా రూ. 75 కోట్లతో వ్యవసాయ యంత్రీకరణ ప్రాజెక్టును తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. అందులో రూ. 16 కోట్లు ఖరు చేయగా, మిగతా రూ. 59 కోట్లు వెనక్కిపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 6 వేల మంది రైతులు లబ్ధిపొందారని తెలిపారు. రైతులకు ఉపయోగపడే సబ్సిడీ పైలట్ ప్రాజెక్టును ఆపారని విమర్శించారు. వీటితోపాటు ఎస్‌డీఎఫ్ గ్రాంటు కింద వీవో, మహిళా కమ్యూనిటీ భవనాలు, కల్వర్టులు, చర్చిలు, మసీదుల మరమ్మతులకు మంజూరైన రూ. 44 కోట్ల నిధులను నిలిపివేయడం నియోజకవర్గ అభివృద్ధిని నిరోధించడమే అని ధ్వజమెత్తారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ పట్టణ, మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సొసైటీల చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో హామీలు అమలు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

గీసుగొండ, డిసెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిందని, మిగిలిన నాలుగేండ్లలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మండలంలోని శాయంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును శనివారం ఆయన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో యంగ్ వన్, కైటెక్స్ వస్త్ర పరిశ్రమల్లో కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం టీఎస్ఐఐసీ, ఆయా కంపెనీ ప్రతినిధులతో సమీక్షించారు. తర్వాత 863 మంది భూ నిర్వాసితులకు కలెక్టర్ చేతులమీదుగా లాటరీ పద్ధతిలో టోకెన్ తీసి లబ్ధిదారులకు మంత్రి ఇండ్ల స్థలాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌రాబు మాట్లాడుతూ ఏటా



భూ నిర్వాసితులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. పార్కులో భూములు కోల్పోన వారికి 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. పార్కులో నాలా నిర్మాణం కోసం రూ. 160 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. పార్కులో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. పరకాల, సంగెం, దామెర మండలాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్, తహసీల్దార్ రియాజుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే, సంగెంలో రూ. 3.25 కోట్లతో నిర్మించనున్న కేజీబీవీ భవనం, రూ. 4.80 కోట్లతో లోహిత గ్రామం నుంచి గోపనపల్లి వరకు బీటీ రోడ్డు పనులను పార్కు వద్ద మంత్రి శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ఊకల్‌లోని నాగేంద్రస్వామి వల్లీదేవి కల్యాణోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన రాజశేఖర్



కవితతో బీఆర్ఎస్ నేత రాజశేఖర్

కాశీబుగ్గ, డిసెంబర్ 7: ఎమ్మెల్సీ, జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బూత్‌స్థాయి నుంచి జాగృతితోపాటు బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన దంపతులపై కేసు

గిర్మాజీపేట, డిసెంబర్ 7: చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. గిర్మాజీపేటలోని రాములవారివీధికి చెందిన వెంగళ సాయి నిరంజన్ కుటుంబానికి గిర్మాజీపేట బొడ్రాయి ప్రాంతానికి చెందిన చింతం మహేందర్ కుటుంబంతో సాన్నిహిత్య సంబంధం ఉంది. ఈ క్రమంలో సాయినిరంజన్, మమత దంపతులు బట్టల వ్యాపారం చేసుకునేందుకు డబ్బులు అవసరం ఉండడంతో మహేందర్ వద్ద రూ. 3.40 లక్షలు అప్పుగా తీసుకున్నారు. తిరిగి ఇవ్వకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా ఏడాదిలోపు వడ్డీతో సహా రూ. 4.40 లక్షలు చెల్లిస్తామని సాయినిరంజన్-మమత దంపతులు ఒప్పుకున్నారు. గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకపోవడంతో మళ్లీ పెద్ద మనుషుల సమక్షంలో సాయినిరంజన్-మమత దంపతులను నిలదీయగా, మమత పేరుతో డీసీసీబీ వరంగల్ బ్రాంచ్ చెక్కును నవంబర్ 25న మహేందర్‌కు ఇచ్చారు. ఆ చెక్కును బాధితుడు బ్యాంక్‌లో వేశాడు. అయితే, బ్యాంక్ ఖాతాను మమత విరమించుకున్నారని అధికారులు తెలిపారు. చెల్లని చెక్కు ఇచ్చినందుకు సాయి నిరంజన్-మమత దంపతులపై మహేందర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిరువ్యాపారిపై ముగ్గురి దాడి

తాగిన మైకంలో చిరువ్యాపారిని గాయపరిచిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వరంగల్ అండర్ రైల్వేబ్రిడ్జి వద్ద కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునే బొల్లం నాగరాజు షాపు వద్ద వినయ్, శ్రీను, సమ్మయ్య శుక్రవారం రాత్రి మద్యం తాగుతున్నారు. ఇక్కడ మద్యం తాగొద్దని నాగరాజు వారితో అన్నాడు. వెంటనే మత్తులో ఉన్న ఆ ముగ్గురు కొబ్బరిమట్టలు, కత్తితో నాగరాజుపై దాడి చేశారు. అతడు కేకలు వేయడంతో పారిపోయారు. తీవ్రంగా గాయపడిన నాగరాజును ఎంజీఎం దవాఖానకు తరలించారు. శనివారం స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నెక్కొండ, డిసెంబర్ 7: మండలకేంద్రంలోని తెలంగాణ గురుకుల విద్యాలయం సమీపంలో శనివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గుర్తుతెలియని కారు బైక్‌ను వేగంగా ఢీకొట్టగా, ద్విచక్ర వాహనంపై ఉన్న మండలంలోని సూరిపల్లికి చెందిన దొమ్మటి యాకయ్య, కుక్కల సాయిబాబు గాయడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

'గ్రీన్‌ఫీల్డ్' రైతుల ముందస్తు అరెస్టు

సంగెం, డిసెంబర్ 7: గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్నారు. తమకు ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ పార్కుకు మంత్రులు వస్తున్నారని, రైతులు అక్కడకు వెళ్లి గొడవ చేస్తారనే ఉద్దేశంతో పలు గ్రామాల రైతులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సంగెం పీఏసీఎస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి యాదవ్, తిమ్మాపురం మాజీ సర్పంచ్ రాంరెడ్డి, కృష్ణానగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ టీచర్ మృతి

శ్రీనివాసరావు

కరీమాబాద్, డిసెంబర్ 7: రంగశాయిపేటకు చెందిన రిటైర్డ్ టీచర్ దున్నాల శ్రీనివాసరావు(65) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు ఉర్సు, కరీమాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మృతదేహానికి పలువురు టీచర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు 12వ సాహిత్య-సంగీత సమ్మేళనం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 7: తెలంగాణ రాష్ట్ర కవుల సంక్షేమ సమాఖ్య, ఏకశిలా కరోకే క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ పద్మాక్షి గుడి సమీపంలోని డాక్టర్ జగదీశ్‌బాబు కళా నిలయంలో 12వ సాహిత్య-సంగీత సమ్మేళనం (కవితలు, సంగీత) నిర్వహించనున్నారు. ఇందులో కవులు విప్పనపల్లి రవికుమార్, ప్రగళ్లపాటి రాజ్‌కుమార్, జయశ్రీ బాదం, మండ వీరస్వామి, నల్లా లక్ష్మీనారాయణ, బిట్టవరం శ్రీమన్నారాయణ, మహ్మద్ సిరాజుద్దీన్, కాజీపేట పురుషోత్తం, ఆచార్య రవికుమార్, అడ్డగూడి ఉమాదేవి, గజవెల్లి అరవింద, మేరుగు అనురాధ, వహీద్ గుల్షన్, కె.వెలంగిణి, పడిడె బాబురావు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెలలో 'అంతరంగ తరంగాలు' అంశంపై కవితాంశం ఉంటుందని, కవులు, అభిమానులు అధిక సంఖ్యలో రావాలని రచయిత సిరాజుద్దీన్ కోరారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

గిర్మాజీపేట, డిసెంబర్ 7: పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాశీబుగ్గలోని లక్ష్మీపురం ప్రాంత నివాసి గందె అనిల్ తన పాన్‌షాప్‌లో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఇంతెజార్‌గంజ్ పోలీస్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి రూ. 59,390 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

దుగ్గొండి, డిసెంబర్ 7: గిర్నిబావికి చెందిన శింగిరికొండ లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానల్లో చికిత్స పొందింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, రూ. 52 వేలు మంజూరయ్యాయి. చెక్కును బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ కాట్ల కోమలా భద్రయ్య శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గొర్రె శ్రీనివాస్, మాజీ వార్డు మెంబర్లు చల్లా సంజీవరెడ్డి, గొర్రె రఘు పాల్గొన్నారు.

'నూతన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి'

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 7: కాలపరిమితి పూర్తయిన ధ్రువీకరణ పత్రాల స్థానంలో కొత్తవి మంజూరు చేసేందుకు ఎంజీఎం దవాఖాన వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని నవతెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో మంజూరు చేసిన ధ్రువీకరణ పత్రాల కాలపరిమితి ముగిసినందున తిరిగి పరీక్షలు నిర్వహించి కొత్త పత్రాలు అందించాలన్నారు.

గ్రామాల్లో మెగా వైద్య శిబిరం

నర్సంపేటరూరల్, డిసెంబర్ 7: మండలంలోని ముగ్దుంపురం, రాజపల్లిలో శనివారం మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. జయముఖి ఫార్మసీ కళాశాల, మెడికవర్ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ఆయా గ్రామాలతోపాటు చుట్టు పక్కల తండాలు, పల్లె వాసులకు బీపీ, షుగర్, బీఎంఐ, ఈసీజీ, రక్త పరీక్షలు చేసి, అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యదర్శి రమ్య, వైద్యులు చార్లీన, కల్యాణి, వాసుదేవమూర్తి పాల్గొన్నారు.

పద్మబ్రాహ్మణులను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

30 మంది పద్మ బ్రాహ్మణులకు సన్మానం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 7: ఇటీవల వరంగల్‌లో జరిగిన పద్మశాలీల వన సమారాధనలో విశిష్ట సేవలు అందించిన 30 మంది పద్మ బ్రాహ్మణులను జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో దేశాయిపేట రోడ్డు రామనాథపురిలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వడ్నాల నరేందర్, తెలంగాణ ప్రాంత సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు కుసుమ సతీశ్, ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, చిప్ప వెంకటేశ్వర్లు, బేతి అశోక్, బైరి శ్యామ్, బైరి మురళీకృష్ణ, రాజు, అశోక్ పాల్గొన్నారు.

డిపాజిట్లు, రుణాల రికవరీలపై దృష్టి సారించాలి

వర్ధన్నపేట, డిసెంబర్ 7: జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో డిపాజిట్లు, రుణాల రికవరీలపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ డీసీసీబీ చైర్మన్, రాష్ట్ర క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదేశించారు. వర్ధన్నపేటలోని డీసీసీబీలో శనివారం మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, హనుమకొండ జిల్లాలోని ఐనవోలు బ్రాంచ్‌ల మేనేజర్లు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. డీసీసీబీ బ్రాంచ్‌లు అందిస్తున్న సేవలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ రాజేశ్‌కన్నా, డీజీఎం అశోక్, ఏజీఎం గొట్టం స్రవంతి, మేనేజర్లు దేవి, సమత, శ్రవణ్, భద్రూనాయక్, సీఈవోలు వెంకన్న, సంపత్, సోమిరెడ్డి, యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశ కార్యకర్తలపై వేధింపులు మానుకోవాలి'

గిర్మాజీపేట, డిసెంబర్ 7: లెప్రసీ, పల్స్‌పోలియో, టీబీ బకాయి పారితోషికాలు చెల్లించాలని పోరాటం చేస్తున్న ఆశ కార్యకర్తలపై ప్రభుత్వం వేధింపులు మానుకోవాలని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. పాత బకాయిలు చెల్లించే వరకూ కొత్త సర్వేలు చేపట్టబోమని మాధవి హెచ్చరించారు. అనంతరం ఆశ కార్యకర్తలపై వేధింపులు, బెదిరింపులు ఆపకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ డీపీహెచ్ఎన్‌వో జ్ఞానసుందరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల జిల్లా కార్యదర్శి చైతన్య, నాయకులు పద్మ, సుజాత, రజిని, రమ, మాధవి, మంజుల, అన్నపూర్ణ, సువర్ణ, కవిత, సంధ్య, సరిత, నజియా, సోని, అనిత పాల్గొన్నారు.

ఆలయానికి స్టీల్ బెంచీల అందజేత

గిర్మాజీపేట, డిసెంబర్ 7: బట్టలబజార్‌లోని శ్రీబాలానగర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వరంగల్ వాసవీ క్లబ్ ప్రతినిధులు శనివారం ఈవో ఎల పాటి రత్నాకర్‌రెడ్డికి రూ. 20 వేల విలువైన పది స్టీల్ బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సెక్రటరీ వీరన్న, ఐపీసీ గాదె వాసుదేవ్, టీ వాసుదేవులు, జిల్లా గవర్నర్ సాంబమూర్తి, పాల మదన్‌మోహన్, అర్చకుడు శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తితో అధిక లాభాలు

వర్ధన్నపేట, డిసెంబర్ 7: అధిక సాంద్రత కలిగిన పత్తిని సాగు చేయడం వల్ల రైతులు అధిక లాభాలు పొందుతారని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం-కేంద్రీయ పత్తి పరిశోధనా స్థానం సంయుక్తంగా మండలంలోని దమ్మన్నపేటలో శనివారం రైతులకు అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధిక సాంద్రత పత్తి సాగులో కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ సారంగం, శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, వర్ధన్నప